# పురాణం కబుర్లు

నీవు లక్ష చెప్పు. నేనిక ఈ పని మొదలు పెట్టక పోనను. అది రేపటినుంచే అమలులో పెట్టేస్తాను.

ఇదేమిటోయ్. ఎప్పుడూ లేదు. ఇవాళ ఇలామాట్లాడు తున్నావు. అసలు మంచి అనేపదానికి అర్థం చెప్పుకోవాలంటే నా కంటికి నువ్వే కనుపించే వాడివి. ఇంతకీ ఇలా మారటానికి కారణం ?

కారణం లేదు. గీరణంలేదు. వెధవది మంచేమిటి ? మంచిగా ఉండి ఇంతఒరగ బెట్టిందేమీ లేదు.

అంటే ?

అంటే గింటే నాన్ సెన్స్ ఈ ప్రపంచంలో మంచేముంది. అంతా చెడ్డే. చెడ్డే మంచి.

అయితే ఇక నువ్వా లంచాలు పుచ్చుకోవడం మొదలు పెడతావన్నమాట ?

ఆ తప్పకుండా.

ఏమిటంత గట్టిగా మాట్లాడుతున్నావు. అలా చేసే వాళ్ళందరిని అసహ్యించుకొనేవాడివి ?

అవును. ఇప్పటివరకూ గుర్తించలేక పోయాను. వాళ్ళంతా నన్నసహ్యించుకొంటున్నారనీ.

బలేబాగుంది వాళ్ళసహ్యించుకుంటే నీకేం ? నీవు మంచివాడివేగా !

నీకేం ఏమిటి ? నాకు కాకపోతే మరెవ్వరికి. ఇక వాళ్ళందరిచేతా మంచివాడ ననిపించుకుంటాను.

ఓహో అదా.

అదా గిదా ఏమిటి నా ఉద్యోగం ఊడిపోతూంది.

ఉద్యోగం ఊడిపోవడం దేనికి.

మంచిగా ఉన్నాను కాబట్టి.

పొరపాటు పడుతున్నావు. ఎవరో దుర్మార్గులు చేసింది చాని కిలా తల్లక్రిందు లౌతున్నావు. కాని ప్రభుత్వం నిన్ను గుర్తిస్తుంది. హరిశ్చంద్రుడు ఎన్ని కష్టాలు పడినా ఇలా మారిపోయాడా ?

ఏమిటోయ్ పురాణం కబుర్లు చెబుతావు. ఇక ఏమీ లాభం లేదు. లంచం పట్టడంవల్ల లక్షలకొద్దీ లాభాలు.

లంచం పట్టకపోతే ఇక మంచమే శరణ్యం. లంచం ఒంటికి మంచిది. మా ఇల్లాలి కంటికి కింపైనది. మా పాపాయి నోటికి తియ్యనిది. ఇచ్చేవాని కిష్టమైనది. పుచ్చుకునే వానికి నష్టం లేనిది. చుట్టునున్న గ్రహాలకు హాయి గూర్చేది. ఎంత చక్కనిదీ లంచం! దీన్ని స్వీకరించుట ప్రపంచాని కింత సాయం చేయుట. ఇంత ఏమిటి ఎంతైనా అనాలి. ఇది ప్రపంచానికి గుండెకాయ. ఇది ఈ సర్వధాత్రిమీద హెచ్చుగా ఉండి కూడ అసహ్యంప బడటం దాని దురదృష్టం. మెజారిటీ ఉండికూడ మైనారిటీగానే ఉండి పోయింది. ఇది చాల శోచనీయమైన విషయం. 'ఎందుచూడ నీవె లంచమా' అయిఉండికూడ కాగితాలమీద ఇది అనవసరంగా గుర్తించ బడలేదు. ఇంత కన్నా అన్యాయం ఇంకొకటి లేదు. అసలీ లంచానికి ఐకమత్యం లేకపోవడ మనేది ఓ పెద్దలోటు. ఓ సంఘం అంటూ దీనికి ఏడవలేదు. అదంతా ఏర్పడాలి.

అబ్బో చాలా దంచావు. లంచాల నాయకుడవై పోయావు. ఇక లంచాల రాజ్యాంగ చట్టా న్నొకదాన్ని తయారుచెయ్యగూడదూ?

నా బ్రతుకుకోసం ఎంతైనా చెయ్యాలి.

'నువ్వొక్కడవే కాబోలు ఈ ప్రపంచంలో బ్రతుకు తూంది' అంతా ఈ పని చేస్తూన్నప్పుడు నేనీ పని చేయక పోవటంలో అర్థంలేదు. అత్యధిక సంఖ్యాబలానికి తలొగ్గక తప్పదు.'

అయితే నీవనుకొంటూన్న ఆ అత్యధిక సంఖ్యాబలం బహిరంగంగా లంచంపట్టడం మంచిదని ఘోషిస్తుం దనుకుంటా.

అదే దానికి వచ్చిన నీరసమంతాను. అక్కడే అది జబ్బుపడిపోతూంది. దానికి పక్షవాతరోగం అప్పుడే, ముసురు కుంటూంది.

అంటే బహిరంగంగా దాన్ని అంగీకరించటానికి ఆ బలానికి మనస్కరించదన్నమాట. దాన్ని బయటపెట్టటానికి వాళ్ళకీ అసహ్యమే నన్నమాట.

ఎలాగైతేనేం దీనివల్ల ఇంత సుఖపడతాం.

సుఖపడగలవని రూఢి ఏమిటి?

అ పట్టుకునే వాళ్ళెవళ్ళయినా వస్తే వాళ్ళకీ ఇంత పారేస్తాం.

వాళ్ళు పుచ్చుకోకపోతేనో?

నేర్పుతాం.

ఇలా ఎంతమందికి నేర్పుతావు?

ఎంతమందికైనా సరే.

ఎంతమందికైనా గుమ్మరించేటంత నీవద్ద ఉండవద్దూ?

ఆపనికి తగ్గంత అదే దొరుకుతుంది.

అంతమందీ లంచాలు పట్టేవాళ్ళే అవుతారని, ఎంత కావలసినా అంత లంచంగా దొరుకుతుందని అనుకోవటం పొరపాట్లేగా.

అయితే పుచ్చుకునే వాళ్ళందరికీ ఈ ఆపదలు లేవా ?

నీ ఉద్దేశ్యం లంచం పట్టినవాళ్ళల్లో ఒక్కడుకూడా జైలుకు పోలేదనా ?

అలా అనలేను.

మరెలా అనగలవు ?

అబ్బ ! నాకేమీ తోచడంలేదు.

నీవు జైలుకుపోతే మీ ఆవిడ కింపుగా ఉంటుందను కుంటాను.

ఛి ! ఛీ ! . . .

పోనీ మీ పాపాయినోరు తియ్యాబడుతుంది.

ఆ. బాగానే పడుతుంది.

పోనీ నీకా లంచం ఇచ్చిన వాని కిదెంతో కష్టంగా ఉంటుంది ఏం ? జైలులో ఉన్న నీకదెంతో ఇష్టంగా ఉంటుంది కదూ.

ఏమిటో నా ప్లానంతా పాడు చేసేస్తున్నావు. మంచిగా ఉన్న నాకు దుష్టశక్తులవల్ల ఉద్యోగం పోతూంది. దీనికిమార్గం ఏమిటి ?

దీనికి మార్గం లంచం పట్టడమే. అది నీ ఒంటికికూడ చాల మంచిది.

నన్నేడిపించక ఏమి చెయమంటావో చెప్పుదూ.

నిన్నేడిపించే వాళ్ళెవరు? నీ లంచం ఈ ప్రపంచానికి గుండెకాయ. నీవు దాని మొండి ఆకారానివి. ఎంతో మెజారిటీతో ఉన్న మీ లంచపు బలగంతో ఉన్న కాస్తమంచినీ మంచులా కరిగించేస్తావు.

అవునులే ఇప్పటి సంగతి చెప్పు.

ఇంకే ముంది. నీ ప్రియతమమైన ఆ మోహినీలంచాన్ని వాహనంగా చేసుకోవడమే. అప్పుడు ప్రజాసమూహం పూలహారాలలో నిన్ను ముంచేస్తుంది. భామినులంతా మంగళహారతు లెత్తుతారు.

నీతో ఇందుకనే చెప్పకూడ దనుకున్నాను.

ఔను మెజారిటీ లేని మాతో చెప్పడం అనవసరమే.

మరి నన్ను నవసరంగా ఇంకో ఊరికిబదిలీ చేసేస్తే నీకిష్టమే ననుకుంటాను.

ఇందాక ఉద్యోగమే పోతుందన్నావు.

మరి అంతభయము కూడ లేకపోలేదు.

అయితే ఇక నీ స్వంతలంచాల శాసనాలు నిర్మించు.

ఛీ! ఈ ప్రపంచంలో బ్రదకటంకన్నా చావటమే మేలు.

మంచిమాటన్నావు. మంచిగా ఉంటే కలగని ఆత్మశాంతి ఆత్మహత్య చేసుకుంటే అమాంతంగా అవతరిస్తుంది.

నిజమే. ఈ హృదయానికి ఇప్పటివరకూ ఎంతో శాంతిగానే ఉంది. ఈ లంచం గురించి తలచుకుంటూ ఉంటే ఎన్నో భయాలు ఆవహిస్తున్నాయి. మనసు పరిపరివిధాల పోతూంది. ఏమీ మార్గం తోచడంలేదు. సుఖంగా ఉన్న మనసును ఊబిలోకి దింపారు.

అదేమిటి? లంచాల 'ప్రైమ్‌మినిష్టరు'గారు ఇలా మంచం పట్టేస్తున్నారు.

ఉండరా బాబు. ఈ లంచపుటూహవల్ల హృదయానికి శాంతి ఉన్నట్టేమీ కనుపించడంలేదు. ఏదో తాత్కాలికంగా కలిగినట్టు ఉన్నా అనుక్షణం శూలంలా పొడిచే ఈ లోపలి మానవావతారానికి ఎవరు సమాధానం చెప్పాలో మరీ అవగాహన కావడంలేదు.

అరే ముందడుగు వేసిన వీరశిఖామణిగారు ఇలా వెనుకడుగేస్తున్నారే?

అది వెనకడుగేలే చూడు ఏమిచేస్తానో. చివరికి సత్యాగ్రహం చేసైనా ఈ దుష్టగ్రహాలని సాధించి తీరుతానో లేదో......

ఇదేమిటి పురాణం కబుర్లు చెబుతున్నావు.

ఇవి పురాణం కబుర్లేలే.

——